సాక్షి పెద్దపల్లి

మంగళవారం ၊ 23 ၊ మే ၊ 2023



ప్రమాదాలపై విచారించాలి

ఓసీపీ–3లో జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను లోతుగా అన్వేషించాలని సింగరేణి డైరెక్టర్ ఎన్వీకే.శ్రీనివాస్ సూచించారు. 8లో▸



వేసవి దుక్కులు మేలు

వేసవిలో దుక్కులతో పంటలకు ఎంతగానో మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జేఎన్టీయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కమాన్‌పూర్(మంథని): మంథని జేఎన్టీయూలో సోమవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకున్నారు. కళాశాలలో ఈఈఈ పూర్తి చేసుకున్న వారితోపాటు ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు రాతపూర్వక పరీక్ష, ఉత్తీర్ణులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జల్లారపు ఆదిత్య, మేకల కృష్ణవేణి, వెలుగుల శివకుమార్, సుంకరి నవీన్, మొవ్వ పద్మపూజిత ఎంపిక కాగా.. వారికి రూ.5.13లక్షల ప్యాకేజీ ప్రకటించి నియామకపత్రాలను జంకో జీఎం, లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ అధిపతి వి.నరసింగరావు అందించారు. కార్యక్రమంలో హెచ్ఆర్‌డీ డీవైజీఎం మైఖేల్ లారెన్స్, అడ్రియాల ప్రాజెక్ట్ ఎలక్ట్రికల్ విభాగం ఇన్‌చార్జి లారెన్స్‌స్టీవ్‌క్యాంప్, డెప్యూటీ మేనేజర్ చైతన్య, సీనియర్ అడ్మిన్ రావుల సతీశ్ పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి దుర్గారావు అభినందించారు.

స్వచ్ఛ పెద్దపల్లిగా తీర్చిదిద్దుకుందాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రమైన పెద్దపల్లి మున్సిపాలిటీని స్వచ్ఛత దిశగా తీర్చిదిద్దుకునే క్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో మాట్లాడారు. రానున్న వానకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలవకుండా.. పారిశుధ్య పనులు మెరుగుపర్చుకునేందుకు చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రూ.16.30లక్షలతో పారిశుధ్యం మెరుగుపర్చేలా రూపొందించిన ప్రణాళికను ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శివప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ నాజ్మిన్ సుల్తానా, కౌన్సిలర్లు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన కలెక్టర్



పాఠశాల ఎస్‌ఓతో మాట్లాడుతున్న కలెక్టర్

రామగుండం: కుందనపల్లి కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సంగీత సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు 20 రోజుల ప్రత్యేక శిక్షణ కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. తరగతుల నిర్వహణ, వసతులు, భోజన సౌకర్యంపై ప్రత్యేకాధికారి కవితను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై కుందనపల్లి పంచాయతీ కార్యదర్శి కృష్ణను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఈవో మాధవి ఉన్నారు.

మాజీ సర్పంచుల సమస్యలు పరిష్కరించండి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచుల సంఘ నాయకులు

పెద్దపల్లిరూరల్: సర్పంచులుగా సేవలందించిన తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని మాజీ సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లికార్జున్‌రావు, నాయకులు చంద శంకర్, కందునూరి ప్రమోద్‌కుమార్ తదితరులు వినోద్‌కుమార్‌ను కలిశారు. ప్రతినెలా రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, జిల్లాకో సంఘ భవనం నిర్మించాలని కోరారు. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని వినోద్‌కుమార్ హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు.

కదలని 'సమీకృతం'

- ముందుకుసాగని గొర్రెలు, మేకల మార్కెట్ పనులు
- రోడ్లపైనే క్రయ, విక్రయాలు
- ఇబ్బంది పడుతున్న పెంపకందారులు



ఇళ్లవద్దనే మూగజీవాలను విక్రయిస్తున్న గొర్రెలకాపరులు

సాక్షి, పెద్దపల్లి: కులవృత్తులకు జీవం పోయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అందులోభాగంగా రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన గొర్రెల, మేకల సమీకృత మార్కెట్‌ను మంజూరు చేసింది. అయితే నేటికీ దాని నిర్మాణ పనులు ముందుకు సాగటం లేదు. దీంతో రోడ్డుపైనే క్రయవిక్రయాలు చేపడుతూ పెంపకందారులు గోస పడుతున్నారు. మరోపక్క రెండో విడత గొర్రెల పంపిణీని 15 రోజుల్లో ప్రారంభించాలని ఇటీవల నూతన సచివాలయంలో సమావేశమైన మంత్రిమండలి నిర్ణయించింది.

నిధులున్నా.. ముందుకు పడని అడుగులు

జిల్లాలోని యాదవ, కుర్మల అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు 2020 సెప్టెంబర్ 20న రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఇతర నేతలు కలిసి రామగుండంలోని కుందనపల్లి వద్ద గొర్రె, మేకల సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన చేశారు. జిల్లాలో 197 ప్రాథమిక గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘాలున్నాయి. వీరికి ఆర్థికాభివృద్ధి సాధించేలా, క్రయవిక్రయాలు చేసుకునేలా కావాల్సిన భూమితోపాటు రూ.25లక్షలు మంజూరు చేశారు. శంకుస్థాపన చేసిన ఏడాదికి 4.5 ఎకరాల్లో రూ.24లక్షలతో నిర్మించడానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండునెలల్లో పూర్తి చేస్తానని ఒప్పందం చేసుకున్నాడు. రెండేళ్లు గడుస్తున్నా పనులు ముందుకుసాగకపోవడంతో గొర్రెల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ లేకపోవడంతో ఎప్పటిలాగే పెద్దపల్లి, మంథని ఫ్లైఓవర్ కింద, ఆయా మండలాల్లో ప్రధాన కూడళ్లలో జీవాల క్రయ, విక్రయాలు చేయాల్సి వస్తోందని పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుందనపల్లిలో మంత్రులు శంకుస్థాపన చేసిన గొర్రెల మార్కెట్ స్థలంలో తాత్కాలికంగా గొర్రెలకాపర్లు షెడ్లు నిర్మించుకుని క్రయవిక్రయాలు సాగిస్తున్నారు.



ప్రతిపాదిత స్థలంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు

రెండో విడత గొర్రెల పంపిణీ ఎప్పుడో..?

● కుర్మ, యాదవుల అభివృద్ధికి చేపట్టిన రాయితీ గొర్రెల పంపిణీకి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపి రెండునెలలు దాటినా ముందుకు సాగకపోవటంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఏప్రిల్‌లో ప్రారంభించి ఆగస్టులోగా పూర్తిచేయాలని కేసీఆర్ ఆదేశించారు. నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో డీడీలు చెల్లించిన లబ్ధిదారులు పంపిణీ వెంటనే ప్రారంభించాలంటున్నారు. రెండో విడతలో 10,789 యూనిట్ల లక్ష్యం కాగా.. 1100 మంది డీడీలు చెల్లించారు. పంపిణీ జరుగుతుందో లేదోనన్న అనుమానంతో డీడీలు చెల్లించేందుకు లబ్ధిదారులు ముందుకురావటం లేదు.



సమీకృత మార్కెట్‌కు మంత్రులు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు

గ్రామం యూనిట్‌గా..

జీవాల ధరలు పెరగడంతో యూనిట్ విలువను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో రూ.1.25లక్షలు ఉండగా దానిని తాజాగా రూ.1.75లక్షలకు పెంచింది. గతంలో లబ్ధిదారుడి వాటా రూ.31,250 ఉండగా.. దానిని రూ.43,750గా నిర్ణయించారు. అప్పట్లో డీడీలు చెల్లించి గొర్రెలు పొందని వారు కొత్త నిబంధనల ప్రకారం అదనంగా రూ.12,500 చెల్లించాల్సి ఉంది. అలాగే తొలివిడతలో మండలం యూనిట్‌గా తీసుకుని లబ్ధిదారులను గుర్తించారు. పలు కారణాలతో తొలివిడత పంపిణీ ప్రహసనంగా మారింది. దీంతో లోటుపాట్లను సవరించి, పారదర్శకత కోసం గ్రామాన్ని యూనిట్‌గా తీసుకున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో గొర్రెల కాపరులు, పెంపకందార్ల సంఘాల సమక్షంలో లాటరీ తీసి గ్రామాలను నిర్ధారించారు. ఈ విషయమై జిల్లాపశుసంవర్ధక అధికారి నారాయణను వివరణ కోరగా.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రెండో విడత పంపిణీ చేపడుతామన్నారు. కుందనపల్లిలో సమీకృత మార్కెట్ పనులు పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

త్వరగా నిర్మించాలి..



రాష్ట్ర ప్రభుత్వం మా సంక్షేమం కోసం కుందనపల్లిలో సమీకృత గొర్రెల, మేకల మార్కెట్‌ను మంజూరు చేసింది. మంత్రులు శంకుస్థాపన చేసి రెండేళ్లు పూర్తికావస్తున్నా పనులు ముందుకుసాగటం లేదు. అధికారులు అలసత్వం, నేతల చొరవ కొరవడటంతోనే జాప్యం చోటు చేసుకుంటోంది. పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి. – ఎలక కొమురయ్య, యాదవ సంఘం ప్రతినిధి

బల్దియా ఎదుట కార్పొరేటర్ నిరసన

- డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆవేదన
- ఎండలోనే నిరసనకు దిగిన అధికార పార్టీ కార్పొరేటర్



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్ అయిత శివకుమార్

కోల్‌సిటీ(రామగుండం): ఆయన అధికార పార్టీ కార్పొరేటర్. అయినా ఆయన డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభించడం లేదు. దీంతో విసిగి వేసారిన ఆయన ఎండలో మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ ఘటన రామగుండం కార్పొరేషన్ ఎదుట సోమవారం చోటుచేసుకుంది. అభివృద్ధి పనులకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ 32వ డివిజన్ కార్పొరేటర్ అయిత శివకుమార్ నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకుంటే ప్రతిరోజూ ఇలాగే ఎండలోనే బల్దియా ముందు నిరసనకు దిగుతానని హెచ్చరించారు. అధికార పార్టీలో ఉన్నా.. అభివృద్ధి పనుల కోసం నిరసనకు దిగక తప్పడం లేదన్నారు. డివిజన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ఏడాదిన్నర నుంచి తిరుగుతున్నా.. మేయర్, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పట్టణ ప్రగతి నుంచి రూ.45లక్షల వ్యయంతో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారని, పది నెలల క్రితం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీధర్‌బాబుకు ఘనస్వాగతం



జిల్లాకేంద్రంలో శ్రీధర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న మక్కాన్‌సింగ్, విజయరమణారావు, తదితరులు

పెద్దపల్లిరూరల్: కర్ణాటక రాష్ట్ర ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరించి తొలిసారి జిల్లాకు వచ్చిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు జిల్లాలో పార్టీశ్రేణులు ఘనస్వాగతం పలికాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులను గజమాలతో సత్కరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన అవినీతిలో కూరుకుపోయిందని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకొస్తామని వెల్లడించారు. ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు, సురేశ్‌గౌడ్, మల్లయ్య, శ్రీనివాస్, సారయ్యగౌడ్, సంపత్, సతీష్, శ్రీమాన్ ఉన్నారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బ్లాక్ కాంగ్రెస్ మంథని అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, నాయకులు వైనాల రాజు, తోట చంద్రయ్య సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

కాంగ్రెస్‌దే విజయం

సుల్తానాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌లో శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి స్వాగతం పలికారు. నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, జెడ్పీటీసీ స్వరూప, ప్రకాశ్‌రావు, మహేందర్, రాములు, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, టౌన్ అధ్యక్షుడు అబ్బయ్య గౌడ్, దామోదర్ రావు తదితరులు ఉన్నారు.

సమసమాజ స్థాపనకు భాగ్యరెడ్డి వర్మ కృషి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో 135వ జయంతి



పూలమాలవేస్తున్న ఎమ్మెల్యే, అడిషనల్‌కలెక్టర్

పెద్దపల్లిరూరల్: సమసమాజ నిర్మాణానికి భాగ్యరెడ్డి వర్మ పాటుపడ్డారని పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం వర్మ 135వ జయంతిని నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి నివాళులర్పించారు. మహనీయుల ఆలోచన విధానాలకు అనుగుణంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మధుసూదన్‌శర్మ, విజయపాల్‌రెడ్డి, సంఘం నాయకులు కైలాసం, మల్లేశ్, లక్ష్మణ్, కిషన్, కరుణాకర్, కొంకటి లింగమూర్తి, మనోజ్, వార్డెన్లు అంజయ్య, తిరుపతిరెడ్డి ఉన్నారు. మంథని ఆర్డీవో కార్యాలయంలో డీఏఓ తూము రవీందర్ నివాళులర్పించారు. ఆ మహనీయుడి ఆశయాలను స్మరించుకుంటూ ముందుకు సాగాలన్నారు.

జంక్షన్లు జామ్..!

- ఆధునీకరణ ఓకే.. విస్తరణే లేదు..
- చౌరస్తాలపై దృష్టి సారించేదెప్పుడో..
- రూ.1.66 కోట్లు కేటాయించినా ఇంకా పాట్లు
- మున్సిపల్ తీరుపై ప్రజల ఆగ్రహం



వాహనాలు తిప్పేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు



ఇరుకుగా మారిన ఫైవింక్లయిన్ చౌరస్తా

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. మరోవైపు జనాభా కూడా అదేస్థాయిలో పెరుగుతోంది. అయితే రద్దీకి తగ్గట్లు అధికారుల ప్రణాళికలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నగరంలో మూడు జంక్షన్లను ఆధునీకరించి రాత్రివేళ ఆహ్లాదంగా కన్పించేలా తీర్చిదిద్దారు. గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తా, ఫైవింక్లయిన్, రాజేశ్ థియేటర్ వద్ద జంక్షన్ల అభివృద్ధికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు భారీగా ఖర్చు చేసింది. ప్రధాన చౌరస్తా అభివృద్ధికి రూ.66 లక్షలు వెచ్చించారు. ఫైవింక్లయిన్ చౌరస్తా వద్ద జంక్షన్‌కు రూ.50లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు. ఇది త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రాజేశ్ థియేటర్ వద్ద జంక్షన్ ఆధునీకరణకు మరో రూ.50లక్షలు వెచ్చించారు. దీంతో ప్రధాన రోడ్లకు రాత్రిపూట ప్రత్యేక శోభ వచ్చినట్లయ్యింది. మూడు జంక్షన్ల విస్తరణకు రూ.1.66కోట్లు వెచ్చించిన కార్పొరేషన్ అధికారులు.. జంక్షన్ల వద్ద విస్తరణ పనులను మాత్రం పూర్తిగా మర్చిపోయారు. దీంతో భారీ వాహనాలు వస్తే వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయంలో మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జనాలు మొత్తుకుంటున్నారు.

ఆధునీకరణకు ఐదేళ్లు.. విస్తరణకు ఇంకెన్నేళ్లో..?

కార్పొరేషన్ పరిధిలో రోడ్ల విస్తరణకు చాలాకాలం ఎదురుచూడాల్సి వచ్చింది. ఏళ్లు గడిచాక నిధులు మంజూరు కావడంతో జంక్షన్ల ఆధునీకరణ పూర్తి చేశారు. ప్రధాన చౌరస్తాలో రూ.66లక్షలతో జంక్షన్ ఆధునీకరించి రంగురంగుల విద్యుత్ దీపాలు, వాటర్‌ఫౌంటెన్ ఏర్పాటు చేయగా.. రాత్రిపూట కనువిందు చేస్తున్నాయి. రాజేశ్ థియేటర్ వద్ద విగ్రహం, వాటర్ ఫౌంటెన్‌తో చూడముచ్చటగా కనిపిస్తోంది. సింగరేణి కార్మికుడి విగ్రహం, కంటిన్యూస్ మైనర్ యంత్రం నమూనాను ఏర్పాటు చేశారు. ఈ రెండు చౌరస్తాలకు భిన్నంగా ఫైవింక్లయిన్ చౌరస్తాను తీర్చిదిద్దారు. అయితే ఈ ప్రాంతంలో ఏ ఒక్క వాహనం ఎదురుగా వచ్చినా ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. రూ.కోటితో మరో రెండు జంక్షన్ల ఆధునీకరణకు ప్రతిపాదనలు వెళ్లాయి. వాటికి అనుమతులు రాలేదు.


విస్తరణను పట్టించుకోని కార్పొరేషన్

జంక్షన్ల ఆధునీకరణపై చూపిన శ్రద్ధ రోడ్ల విస్తరణపై లేదంటున్నారు ప్రజలు. నిత్యం వేలాది ద్విచక్ర వాహనాలు, వందల సంఖ్యలో భారీ వాహనాలు వెళ్తుంటాయి. జంక్షన్ల వద్ద మూలమలుపు తిప్పేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

సింగరేణి రోడ్లు పూర్తయ్యేదెప్పుడో..?


గోదావరిఖనిలోని రాజీవ్ రహదారిని ఆనుకుని ఫైవింక్లయిన్‌వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించేందుకు రామగుండం కార్పొరేషన్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనిలో గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు పనులు పూర్తయ్యాయి. మిగితా పనులు జాప్యం జరుగుతున్నాయి. దీంతో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఫైవింక్లయిన్ నుంచి ఏరియా ఆసుపత్రి వైపు వెళ్లే రోడ్డు గుంతలుగా మారి ప్రమాదాల బారిన పడుతున్నారు.

బస్ ఆగితే రోడ్డు బ్లాకే



ఫైవింక్లయిన్ బస్టాప్ వద్ద బస్ ఆగినప్పుడు రోడ్డు బ్లాక్ అవుతోంది. అక్కడే ఆటోస్టాండ్ ఉండడం.. ఆటోలు అడ్డుగా పెట్టడంతో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. జంక్షన్ల డెవలప్‌మెంట్‌తోపాటు రోడ్లు కూడా విశాలంగా చేస్తే బాగుంటుంది. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. – పెరుక శ్రీనివాస్, స్థానికుడు

మూలమలుపులు చిన్నగా



ప్రధాన చౌరస్తాలో అన్ని ప్రాంతాల వారు ఇబ్బంది పడుతున్నారు. ప్లానింగ్ లేకుండా చేయడంతో ఇబ్బంది పడుతున్నాం. రాంగ్‌రూట్‌లో వచ్చే సరికి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల విస్తరణ చేపడితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. సభలు జరిగినప్పుడు ట్రాఫిక్ మళ్లిస్తే మరింత ఇబ్బంది అవుతోంది. – కన్నం సాయి, స్థానికుడు



సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం

గోదావరిఖని: సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలను సోమవారం స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కలెక్టర్ ప్రారంభించారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మూడు రోజులపాటు పోటీలు ఉంటాయని తెలిపారు. బ్యాడ్మింటన్, రెజ్లింగ్, బాక్సింగ్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ వంటి మొత్తం 11 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, మేయర్ అనిల్‌కుమార్, అధికారులు వెంకట మాధవ్‌రావు, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఇంట్లోకి వచ్చిన నెమలి


నెమలిని ఫారెస్ట్ ఆఫీసర్‌కు అప్పగిస్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లోకి సోమవారం జాతీయ పక్షి నెమలి వచ్చింది. స్థానికుల సమాచారంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది ఎ.రమేశ్, గట్టయ్య అక్కడికి చేరుకున్నారు. నెమలిని ఫారెస్ట్ ఆఫీసర్ రహ్మతుల్లాకు అప్పగించారు. అనంతరం అడవిలో వదిలిపెట్టినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంథని: డివిజన్‌లోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాల్లోని విత్తన విక్రయ కేంద్రాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా మండలాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో స్టాక్ వివరాలను పరిశీలించారు. హెచ్‌టీ కాటన్ అమ్మితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ఫర్టిలైజర్, విత్తనాల విక్రయదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రైతులకు విక్రయించే విత్తనాలు, ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్ముతున్నట్లు తెలిస్తే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100 సమాచారం ఇవ్వాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధుసూదన్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాణి వర్మ, బేతి రాములు, వ్యవసాయ అధికారులు అనూష, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఆయన చూపు సజీవం


రాజయ్య (ఫైల్)

మంథని: మండలంలోని లక్కేపూర్ గ్రామానికి చెందిన సింగరేణి విశ్రాంత కార్మికుడు ఊరగొండ రాజయ్య(70) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన నేత్రాలను సమాజహితం కోసం ఐ బ్యాంకుకు దానం చేయడానికి కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా సోమవారం రాజయ్య కళ్లను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. నేత్రదాత కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, నూక రమేశ్, భీష్మాచారి, రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధి బేణిగోపాల్ త్రివేది అభినందించారు.

వేసవి దుక్కులు.. పంటకు మేలు

- 9 అంగుళాల లోతు తగ్గకుండా చూసుకోవాలి
- భూసారం పెరిగి, తెగుళ్ల నివారణకు అవకాశం


ముప్పిరితోటలో దున్నిన వేసవి దుక్కి

ఎలిగేడు(పెద్దపల్లి): వేసవిలో దుక్కులతో పంటకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. భూసారం పెరగడంతోపాటు తెగుళ్ల నివారణకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పత్తిని సాగు చేసిన రైతులు పత్తి కర్రలను కాల్చిన అనంతరం దుక్కులు దున్నిస్తున్నారు. సరిపడా తేమ ఉన్న చేను, పొలాల్లో 9 అంగుళాల లోతు తగ్గకుండా దుక్కులు చేసుకోవాలి.

పంటల అవశేషాలు కుళ్లుతాయి..

ఈసారి వానాకాలం సీజన్‌లో ఎలిగేడు మండలంలో రైతులు 1,000 ఎకరాల్లో పత్తి, 14 వేల ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచగా, మరికొందరు దున్నడానికి సిద్ధమవుతున్నారు. తొలకరి వర్షాలకు ముందు వేసవిలోనే దుక్కులు దున్నడం వల్ల పంటల అవశేషాలు దుక్కిలో కుళ్లి, కర్బనశాతం పెరుగుతుంది. చేలల్లో పురుగులు, గుడ్లు ఉంటే పైకి తేలి, సూర్యరశ్మి తగిలి చనిపోతాయి. నీటి నిల్వ సామర్థ్యం 50 శాతం పెరుగుతుంది. లోతు దుక్కుల వల్ల కలుపు మొక్కలు మట్టి కిందకు చేరి, సేంద్రియ ఎరువుగా మారుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

దున్నకుంటే నష్టాలు..

కోతల తర్వాత దుక్కి దున్నకుండా వదిలేస్తే భూమి గాలి పీల్చుకునే శక్తిని కోల్పోతుంది. కలుపు మొక్కలు పెరిగి, భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి, భూసారాన్ని తగ్గిస్తాయి. విత్తడానికి వారం, పది రోజుల ముందు దుక్కులు సిద్ధం చేసుకోవడం వల్ల ఆశించిన దిగుబడి రాకుండా పోతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఖర్చులు తగ్గుతాయి..



నేను ఏటా వేసవిలో దుక్కులు దున్నుతా. ఐదెకరాల్లో లోతుగా దుక్కి దున్నడంతో రాలిన ఆకులు నేలలో కలిసి, కుళ్లిపోతాయి. సేంద్రియ ఎరువులు చల్లి, మళ్లీ దున్నుకుంటాం. దీంతో వర్షపునీరు వృథాగా పోకుండా భూమిలోనే ఇంకుతుంది. ఖర్చులు సైతం తగ్గుతాయి.
– ఇరుగురాల రవి, రైతు, ఎలిగేడు

దుక్కులు చేసుకోవాలి..

రైతులు చేలు, పొలాలను వేసవిలో దున్నుకోవాలి. పత్తి, మొక్కజొన్న సాగు చేసినవారు తొలైన దుక్కులు చేసుకోవాలి. దీనివల్ల నేలలో ఉన్న పురుగులు చనిపోతాయి. సేంద్రియ, కర్బన పోషక పదార్థాలు పెరుగుతాయి. పంట ఏపుగా పెరిగి, దిగుబడి ఎక్కువ వస్తుంది.
– ఎం.ఉమాపతి, మండల వ్యవసాయశాఖ అధికారి, ఎలిగేడు



కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న యునైటెడ్ ఫోరం నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ యునైటెడ్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రాజెక్టు లేబర్ గేట్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆరు నెలల క్రితం ఎన్టీపీసీ యాజమాన్యానికి డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం ఇచ్చామని, నేటి వరకు ఆశించిన స్థాయిలో స్పందన లేదన్నారు. కార్మికుల హక్కులు సాధించాలంటే పోరాటం ఒక్కటే మార్గమని, లాబీయింగ్‌తో సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్న మహారత్న హోదా గల ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు కార్మికుల శ్రమ లేకుండా ముందుకెళ్లలేదనే విషయాన్ని గ్రహించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేయక తప్పదని తెలిపారు. సమావేశంలో యునైటెడ్ ఫోరం నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, చిలుక శంకర్, రాజమల్లయ్య, బుచ్చన్న, భూమయ్య, సత్యం, కొమురయ్య, రాజిరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నాడు దళంలో.. నేడు సమస్యల్లో

- 2010లో అరెస్టు.. రెండేళ్ల జైలు జీవితం
- గతంలో మావోయిస్టు పార్టీలో ఏరియా కమిటీ బాధ్యుడి హోదా
- నేడు ఐస్‌క్రీం అమ్ముతూ.. అనారోగ్యంతో సతమతం
- ప్రభుత్వం దళితబంధు మంజూరు చేయాలని బాధితుడి వేడుకోలు


ఐస్‌క్రీం అమ్ముతున్న నాగరాజు

ఓదెల(పెద్దపల్లి): సమసమాజ నిర్మాణం కోసమంటూ మావోయిస్టు పార్టీలో చేరి, నాలుగేళ్లు పని చేశాడు. ఆ తర్వాత అనుకోకుండా అరెస్టయ్యి, జైలు జీవితం గడిపాడు ఓదెల గ్రామానికి చెందిన కోంద్ర నాగరాజు అలియాస్ రమాకాంత్. ప్రస్తుతం అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఓదెలలో దళిత సామాజికవర్గానికి చెందిన నాగరాజు ఐదోతరగతి వరకు చదువుకున్నాడు. జీతానికి పశువుల కాపరిగా పనిచేస్తున్న సమయంలో మావోయిస్టులతో పరిచయం ఏర్పడింది. వారి పాటలకు, కార్యకలాపాలకు ఆకర్షితుడై, 2006లో మావోయిస్టు పార్టీలో చేరాడు. తర్వాత ఏటూరు నాగారం, మహదేవపూర్, గుండారం, నర్సంపేట్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలలో దళ నేతగా, ఏరియా కమిటీ బాధ్యుడిగా పని చేశాడు. ప్రభుత్వం నాగరాజు తలపై రూ.2 లక్షల రివార్డు ప్రకటించింది. మావోయిస్టు పార్టీలో చురుగ్గా పనిచేస్తున్న అతనికి మహారాష్ట్రలో పార్టీ నిర్మాణ బాధ్యతలను పైస్థాయి నాయకులు అప్పగించారు. 2010 జనవరి 27న మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్పీ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు నాగరాజును అరెస్టు చేశారు. రెండేళ్లు జైలు జీవితం గడిపిన అనంతరం స్వగ్రామం ఓదెలకు వచ్చాడు. అప్పటినుంచి ఇక్కడే జీవిస్తున్నాడు. గ్రామంలో ఎలాంటి ఆస్తిపాస్తులు లేని నాగరాజు బీపీ, గుండె సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ప్రస్తుతం ద్విచక్రవాహనంపై ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో ఐస్‌క్రీం అమ్ముతున్నాడు. తాను అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నానని, ఇంట్లో తనతో భార్య, తల్లి, తమ్ముడు ఉన్నాడని తెలిపాడు. ప్రభుత్వం కనికరించి, దళితబంధు పథకం మంజూరు చేస్తే సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలకు జీవితాంతం రుణపడి ఉంటానని వేడుకుంటున్నాడు.

జూలై 1 నుంచి నూతన వేతన ఒప్పందం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని(రామగుండం): కార్మికుల ఐక్య పోరాటాల వల్లే నూతన వేతన ఒప్పందం ఖరారైందని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. సోమవారం పలు డిపార్ట్‌మెంట్లపై సంఘం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 1 నుంచి నూతన వేతన ఒప్పందం ప్రారంభం కానుందన్నారు. అలాగే కాంట్రాక్టు, రిటైర్డ్ కార్మికులకు సంబంధించిన సమస్యలపై 60 డిమాండ్లతో కూడిన నోటీసును కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలకు అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏ ప్రభుత్వ రంగ సంస్థల్లో పది శాతం కన్నా వేతనాలు పెంచలేదని, బొగ్గు గని కార్మికులకు బేసిక్‌పై 19 శాతం, అలవెన్సులపై 25 శాతం పెంచుకోవడం గొప్ప విషయమన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బ్రాంచి కన్వీనర్ ఆరెల్లి పోషం, నాయకులు రంగు శ్రీనివాస్, మాదన మహేశ్, ఎంఏ.గౌస్, సంకె అశోక్, ఎస్.వెంకట్‌రెడ్డి, శనగల శ్రీనివాస్, మానాల శ్రీనివాస్, పెర్క మహేందర్, కలవేని రాజేశ్, పర్లపెల్లి రామస్వామి, పెద్దెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి ఒకరు.. రైలు ఢీకొని మరొకరు

- కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరి దుర్మరణం
- గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి మృతదేహాల తరలింపు


సోనుకుమార్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట–బల్లార్షా సెక్షన్ల మధ్యలోని కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి కిందపడటంతో సోనుకుమార్(20), రైలు ఢీకొని 30 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందారు. రామగుండం జీఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని సమస్తీపూర్ జిల్లా దుదుపూర్‌కు చెందిన సోనుకుమార్ ఏడాది క్రితం కూలి పని కోసం కేరళ వెళ్లాడు. తిరిగి బిహార్‌కు రైలులో వస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు కింద పడటంతో తలపగిలి, అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే 30 ఏళ్ల యువకుడిని గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఇతని వివరాలు తెలియరాలేదు. ఇద్దరి మృతదేహాలను గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. వివరాలకు 99493 04574, 94407 00039 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రయాణికుల భయాందోళన..

ఉదయం పూట ప్రమాద విషయం తెలుసుకున్న భాగ్యనగర్, రామగిరి, ఇంటర్‌సిటీ రైళ్ల ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారేసరికి రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరి మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉండటంతో అలజడి రేగింది. రైల్వే సిబ్బంది వెంటనే రామగుండం పోలీసులకు సమాచారం అందించారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా


చర్చల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై చర్చలు వాయిదా పడ్డాయి. సోమవారం కార్మికుల వేతన ఒప్పందంలోని 10 డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. కార్మికులకు చెల్లించే వేతనాలు, ప్రస్తుతం ఉన్న అదనపు భత్యం కంటే రూ.ఆరువేల మేర పెంచాలని చేసిన డిమాండ్‌పై రూ.400 మాత్రమే చెల్లించేందుకు యాజమాన్యం సుముఖత వ్యక్తం చేసింది. కార్మిక సంఘాల ప్రతినిధులు ఆమోదయోగ్యంగా లేదని, పునరాలోచించాలని కార్మిక సంఘాలు యాజమాన్యానికి తెలిపారు. దీంతో చర్చలు వాయిదా పడ్డాయి. తిరిగి ఈనెల 24న హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సీ సమక్షంలో వేతన ఒప్పందం అమలుపై చర్చించనున్నారు. చర్చల్లో వివిధ యూనియన్లకు చెందిన నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, ఇజ్జగిరి భూమయ్య, భూమల్ల చందర్, లక్ష్మయ్య, రాధారపు రాజమల్లయ్య, శ్రీనివాస్, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ముస్లిం యువకుడి అన్నదానం


స్వాములకు భిక్ష వడ్డిస్తున్న కరీం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు కాలనీకే చెందిన ఎస్కే.కరీం సోమవారం అన్నదానం చేసి, మత సామరస్యాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా అతన్ని ఆలయ కమిటీవారు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, తంగళ్లపల్లి కొమురయ్య, రాయమల్లు, స్టాలిన్ గౌడ్, శ్రీనివాస్, సురేష్, వాసు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల సంబరాలు


టపాసులు పేల్చుతున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికుల 11వ వేజ్‌బోర్డు ఒప్పందం పూర్తయిన సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో టపాసులు పేల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ ఒప్పందం సింగరేణి కార్మికుల ఘన విజయమన్నారు. ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, మాదన మహేశ్, ఎస్.వెంకట్‌రెడ్డి, బోగ సతీశ్‌బాబు, పర్లపల్లి రామస్వామి, పి.నాగేంద్రకుమార్, జి.ప్రభుదాస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక


శ్రీమాన్‌ను అభినందిస్తున్న ఎంపీడీవో రామ్మోహనాచారి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని కిష్టంపేటకు చెందిన మేడగోని శ్రీమాన్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అతను రామగుండంలో నిర్వహించిన సీఎం స్పోర్ట్స్ కప్ జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటాడు. ఈ సందర్భంగా శ్రీమాన్‌ను ఎంపీడీవో రామ్మోహనాచారి, గ్రామస్తులు సోమవారం అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఓ ఇంట్లో బీరువా తెరిచి చూడగా నగదు, బంగారం ఏమీలేక పోవడంతో వెనుదిరిగారు. వివరాల్లోకి వెళ్తే.. ఎంపీటీసీ మాజీ సభ్యుడు దివంగత గోలి సత్యనారాయణ భార్య రాజమణి ఇంటికి తాళం వేసి, భూపాలపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. సోమవారం తిరిగి వచ్చి, చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపల వస్తువులన్నీ భద్రంగా ఉన్నాయి. బీరువా తెరిచి, ఉండటంతో చోరీకి యత్నించారని భావించి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలోనూ ఓసారి ఇంటికి తాళం వేసి, ఊరెళ్లిన సమయంలో దొంగలు చొరబడి, బీరువాలో ఉన్న నగదు, బంగారం ఎత్తుకెళ్లారని రాజమణి తెలిపింది. ఎస్సై శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాద కారణాలపై విచారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): ఓసీపీ–3లో జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను లోతుగా అన్వేషించాలని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే.శ్రీనివాస్ సూచించారు. రక్షణ చర్యలపై స్థానిక జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని యూనియన్ల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆర్జీ–2 జీఎం మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య రక్షణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భారీ యంత్రాలపై ప్రమాదాలు జరగనీయొద్దని, వీటిపై అందరికీ అవగాహన కలిగించాలని సూచించారు. టీబీజీకేఎస్ నుంచి ఐలి శ్రీనివాస్, శంకర్ నాయక్, కె.రవీందర్, తిరుపతి, బీఎంఎస్ నుంచి వి.కుమారస్వామి, ప్రమోద్ కోషాల్, ఏఐటీయూసీ నుంచి రాజారత్నం, ఎ.రవికుమార్, ఐఎన్‌టీయూసీ నుంచి మార్కండేయ, సీహెచ్.ప్రసాద్, హెచ్ఎంఎస్ నుంచి దావు రమేశ్, ఎస్.సత్తయ్య, సీఐటీయూ నుంచి ఉల్లి మొగిలి, ఎం.భూమయ్య, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఏరియా రక్షణ అధికారి బచ్చ రవీందర్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డీజీఎం సివిల్ ధనుంజయ పాల్గొన్నారు.

జాతీయ కార్మిక సంఘాలను నిలదీయండి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న


మాట్లాడుతున్న వెంకన్న

కమాన్‌పూర్(మంథని): 11వ వేతన ఒప్పంద చర్చల్లో కుమ్మక్కై, సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ద్రోహం చేసిన జాతీయ కార్మిక సంఘాలను నిలదీయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న పిలుపునిచ్చారు. సోమవారం సెంటనరీకాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులు గత దశాబ్ద కాలంగా ఫస్ట్ కేటగిరీ వేతనం, పర్మినెంట్ తదితర చట్టబద్ధ హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. ఇందుకోసం 19 రోజులు సమ్మె చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దాని అనుబంధ కార్మిక సంఘాలు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీలు కుమ్మక్కై, ఏ ఒక్క డిమాండ్ సాధించకుండానే సమ్మె విచ్ఛిన్నానికి కారణమయ్యారని ఆరోపించారు. వేతన ఒప్పంద చర్చల్లో సింగరేణి కాంట్రాక్ట కార్మికుల సమస్యలు చర్చించకుండా ద్రోహం చేసిన జాతీయ కార్మిక సంఘాల నేతలు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందు అశోక్, నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

19 శాతం గత ఒప్పందం కంటే తక్కువ

గోదావరిఖని(రామగుండం): ఏళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్న 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో 19 శాతం కుదుర్చుకోవడం సిగ్గుచేటని టీడీపీ నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ విమర్శించారు. జాతీయ సంఘాలు పోరాట శక్తిని కోల్పోయాయని ఎద్దేవా చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గని కార్మికులకు గత వేజ్‌బోర్డు కంటే తక్కువ శాతం ఒప్పందం చేశారని, ఇది కార్మికులకు తీవ్ర నష్టమన్నారు. సింగరేణిలో దాదాపు 30 వేల మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఒప్పందం చేయలేకపోయారని, కనీసం వారిని కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించినా ఉద్యోగ భద్రత ఉండేదని పేర్కొన్నారు. ఈ నెల 27, 28వ తేదీల్లో రాజమండ్రిలో జరగబోయే టీడీపీ మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు కోటగిరి పాపయ్య, అనుమ రాజమల్లు, నగునూరి రాజయ్య, ఎండీ.వాజిద్, చిటికెల రాజలింగు, గుండబోయిన ఓదెలు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత లక్ష్యాలు సాధించాలి


బాలికలతో జీఎం ఠాకూర్

జ్యోతినగర్: బాలికలు ఉన్నత లక్ష్యాలు సాధించి జీవితంలో రాణించాలని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు జనరల్ మేనేజర్ అలోక్ చంద్ర ఠాకూర్ అన్నారు. సోమవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న బాలికా సాధికారత–2023 శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. సమాజంలో ప్రస్తుతం ఆడ, మగ తేడా లేదని, ప్రతిభ ఉంటే అన్ని రంగాల్లో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జెమ్ శిక్షణా శిబిరం నిర్వాహకులు బాలికలు పాల్గొన్నారు.

రచ్చపల్లిలో అభివృద్ధి పనులు చేపట్టండి


వినతిపత్రం ఇస్తున్న సర్పంచు శ్రీనివాస్

మంథని: మండలంలోని రచ్చపల్లిలో అభివృద్ధి పనులు చేపట్టాలని సర్పంచు కనవేన శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్జీ–3 జీఎం టీవీ రావుకు వినతిపత్రం అందించారు. ఆర్అండ్ఆర్ కాలనీలో శ్మశానవాటిక, దోబీఘాట్‌ల వద్దకు వెళ్లడానికి రోడ్లు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని, నీటికోసం బోర్‌ను బిగించాలని కోరారు. స్పందించిన ఆయన ఆర్అండ్ఆర్ కాలనీలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని డీజీఎం పద్మరాజును ఆదేశించారు.

హద్దురాళ్ల తొలగింపు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట గ్రామ పంచాయతీ పరిధిలో లేఅవుట్ అనుమతి పొందకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో హద్దురాళ్లను సోమవారం తొలగించారు. సర్పంచు కొమ్ము శ్రీనివాస్, పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి జేసీబీతో రోడ్లను దున్నించి, హద్దురాళ్లను తొలగింపజేశారు. లేఅవుట్ అనుమతి ఉంటేనే ఇంటి నిర్మాణానికి అనుమతులను ఇస్తామని సర్పంచు తెలిపారు. అనుమతి లేని ప్లాట్లను కొనుగోలు చేసి, ఇబ్బంది పడొద్దని సూచించారు.